సాక్షి చిత్తూరు

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



పంటలపై ఏనుగుల దాడులు

పెద్దపంజాణి మండలంలో రైతులు సాగు చేసిన వరి పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. - 8లో



అడ్డుగా ఉన్నాడనే..

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి ఓ మహిళ భర్తను చంపినట్లు విచారణలో తేలింది. - 8లో



పారిశుద్ధ్యానికే ప్రాధాన్యత

గ్రామాల్లో పారిశుధ్యానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ బాబు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

10.103 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమబియ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు 10.103 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. డీటీలు పయణి, శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు..మురకంబట్టు ప్రాంతంలోని ఓ ప్రైవేటు గదిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు డీఎస్‌ఓ శంకరన్‌కు వివరాలను అందించారు. దీంతో అధికారులు గోడౌన్‌పై దాడి చేయగా 10.103 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుబడింది. ఈ బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. అక్రమ వ్యాపారుడిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్ ఉన్నారు.

బోగస్ విద్యార్థులను గుర్తించేందుకు త్రిమెన్ కమిటీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో బోగస్ విద్యార్థులను గుర్తించేందుకు త్రిమెన్ కమిటీని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు త్రిమెన్ కమిటీ సభ్యులు త్వరలో జిల్లాలో పర్యటించి ఎయిడెడ్ పాఠశాలలను సందర్శించనున్నారు. అందులో బోగస్ విద్యార్థుల సంఖ్యను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టనున్నారు.

రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 15వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమావేశం నిర్వహణకు చేపట్టాల్సిన కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులు గురువారం ఎంఈఓలకు తెలిపారు. ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం నిర్వహించనున్నారు. ఆపై జిల్లా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు తెలియజేశారు.

నేడు మాజీ ముఖ్యమంత్రి జయంతి కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు 14వ తేదీన ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పలు శాఖల అధికారులు, సంఘ నాయకులు హాజరు కావాలని కోరారు.


న్యాక్ బృందం పరిశీలన



న్యాక్ బృంద సభ్యులకు కళాశాల సౌకర్యాలను తెలియజేస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం న్యాక్ (నేషనల్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం) బృంద సభ్యులు పరిశీలించారు. గోవా యూనివర్సిటీ ఫార్మర్ ప్రొఫెసర్ సుదర్శన్, అస్సాం డాన్ బోస్కో యూనివర్సిటీ రిజిస్ట్రార్ జానీ జోస్, కర్ణాటక రాష్ట్రం ఎస్టీ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ పాల్ న్యూమన్ కళాశాలను సందర్శించారు. ఆ బృంద సభ్యులు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మౌలిక వసతులు, విద్యాబోధన, తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ల్యాబ్‌లు, లైబ్రరీలను పరిశీలన చేశారు. గత ఐదేళ్ల పాటు కళాశాల అభివృద్ధిని, విద్యా కార్యకలాపాలను న్యాక్ సభ్యులకు ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి క్షుణ్ణంగా వివరించారు. న్యాక్ ప్రమాణాలతో కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, బోధన, పరిశోధన తదితర అంశాలను తెలియజేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వారి సూచనలు, సలహాలను తెలియజేశారు. ప్రస్తుతం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ ఉంది. కొత్త గ్రేడ్ త్వరలో ప్రకటించనున్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం.. మాయం





– ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు వనజ. చిత్తూరు నగరం వినాయకపురం నివాసి. భర్తతో పాటు కాపురం ఉంటున్న ఈమెకు రేషన్‌కార్డు ఉంది. ఈమె కార్డుకు ప్రతి నెలా 35 కేజీల బియ్యం వస్తాయి. ఈ నెల రేషన్‌కు వెళ్తే బియ్యం ఖాళీ అయిందని, వచ్చే నెల తీసుకోమని డీలర్ చెప్పాడు. గట్టిగా ప్రశ్నించే సరికి డబ్బులు చేతిలో పెట్టాడు. దీంతో ఆ వృద్ధురాలు చివాట్లు పెడుతూ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు ఈ చివాట్లను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టేశారని చెప్పుకొచ్చింది. సామీ నాకు దుడ్డు వద్దు.. బియ్యం కావాలని వేడుకుంటోంది.

- చిత్తూరులో కూటమి నేత కన్నుసన్నల్లో రేషన్ దందా
- డీలర్ అవతారం ఎత్తి బియ్యం దోపిడీ
- అరకొరగా సరుకులు.. ప్రశ్నిస్తే నగదు ఇస్తున్న డీలర్
- అమాయకులైతే కేజీకి రూ.10, గట్టిగా అడిగితే రూ.15 ఇస్తున్న వైనం
- తమిళనాడు, కర్ణాటకకు తరలిపోతున్న పేదల బియ్యం
- లబోదిబోమంటున్న కార్డుదారులు
- సోషల్ మీడియాలో అక్రమ వ్యాపారం వైరల్
- సీజ్ ద షాప్ అంటూ కామెంట్లు
- అయినా చలించని అధికారులు

చిత్తూరు రూరల్ : చిత్తూరులో కూటమి నేతల రేషన్ దందా హద్దుమీరిపోయింది. పేదల బియ్యాన్ని గద్దల్లా మింగేస్తున్నారు. సరుకుల పంపిణీల్లో భారీగా కోతలు పెడుతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా దోచేస్తున్నారు. నేతలే డీలర్ అవతారమెత్తి ఈ దందాకు పాల్పడుతున్నారు. సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు కోతలు పెడుతున్నారు. గట్టిగా అడిగితే డబ్బులు చేతిలో పెడుతున్నారు. ఆపై బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటించి కాసులు దండుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే కనీసం స్పందించడం లేదని కార్డుదారులు ఆందోళనకు దిగారు. గురువారం షాపు ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తతంగం అంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పలువురు 'సీజ్ ద షాప్' అంటూ కౌంటర్లు వేస్తున్నారు.




వినాయకపురంలోని షాపు

చిత్తూరు నగరంలోని వినాయకపురంలో 41వ రేషన్ షాపు ఉంది. ఈ షాపు పరిధిలో 396 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెల 80 నుంచి 90 బ్యాగుల రేషన్ బియ్యం, అలాగే చెక్కెర 400 కేజీలు, కంది పప్పు 396 కేజీలు పంపిణీ చేయాలి. ప్రతినెలా చివరిలో షాపునకు సరుకులు వస్తాయి. 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సరకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ.. రేషన్ సరుకుల పంపిణీలో గోల్‌మాల్ చేస్తున్నారని కార్డుదారులు మండిపడుతున్నారు. కాగా ఈ నెల 80 బ్యాగుల బియ్యం సరఫరా అయితే 10 బ్యాగుల బియ్యం మిగులు ఉండాలని అధికారులు లెక్కలు చెబుతున్నారు.

ఎలా దోచుకుంటున్నారంటే..!

నిర్ణీత సమయంలో రేషన్ పంపిణీ జరగాలనే ప్రభుత్వ నిబంధన ఉంది. అయితే వినాయకపురంలో రెండు, మూడు రోజుల్లోనే పంపిణీని ముగిస్తున్నారు. అది కూడా ఆ నేత చెప్పినట్టే బియ్యం తీసుకోవాలనే నిబంధన ఉంది. లేకుంటే బియ్యం చేతికి అందవు. ప్రధానంగా సరుకుల పంపిణీల్లో భారీగా కోతలు పెడుతున్నారని కార్డుదారులు దిగాలు చెందుతున్నారు. 10 కేజీలు ఇవ్వాల్సి ఉంటే 5 కేజీలు, 35 కేజీలు ఇవ్వాల్సి ఉంటే 20 కేజీలోపు ఇచ్చి మిగిలింది నొక్కేస్తున్నారని కార్డుదారులు కంటతడి పెడుతున్నారు. ఇదేమని గట్టిగా ప్రశ్నిస్తే.. డబ్బులు ఇచ్చి సర్ది చెబుతున్నారని అంటున్నారు. అమాయకులైతే కేజీకి రూ.10, గట్టిగా అడిగే వారికి అయితే రూ.15 చొప్పున చెల్లించి నోరు మూయిస్తున్నారని చెబుతున్నారు. చాలామందికి బియ్యం లేదని, వచ్చే నెల తీసుకోమని తిప్పి పంపిస్తున్నారని వాపోతున్నారు.

రేషన్ బియ్యమే దిక్కు..



వినాయకపురం ప్రాంతంలో చాలామంది దినసరి కూలీలు నివాసం ఉంటున్నారు. ఇందులో అధికశాతం భవన నిర్మాణ కూలీలే. వీరంతా రేషన్ బియ్యం ఆధారపడి పూట గడుపుతున్నారు. నెలకు సరిపడా బియ్యాన్ని భద్రంగా దాచి పెట్టి వండుకుని తింటున్నారు. అయితే ఆ బియ్యం నోటికొచ్చే సమయంలో పందికొక్కులు తినేస్తున్నాయని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఇలాంటి తరుణంలో పస్తులతో పూట గడుపుతున్నామని కార్డుదారులు వాపోతున్నారు. కారణం సరుకుల్లో భారీ కోతలు పెడుతూ అడ్డంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమ వ్యాపారమా..?

కార్డుదారుల బియ్యాన్ని ఆ నేత అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని కార్డుదారులు అంటున్నారు. ఆపై బహిరంగంగా బియ్యాన్ని ఆటోలో మార్కెట్‌కు తరలిస్తారు. కొంతవరకు బియ్యాన్ని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రానికి అడ్డదారిలో హద్దులు దాటిస్తారు. అక్కడి వ్యాపారులకు కేజీ రూ.25 నుంచి రూ.30 వరకు అమ్మేస్తున్నారు. మిగిలిన బియ్యాన్ని సన్నబియ్యంగా మారుస్తారు. మంచి బ్రాండ్ ఉన్న బ్యాగుల్లో నింపి మళ్లీ ప్రజలకే అంటగడుతారు. ఆ బ్యాగును రూ.1300 చొప్పున విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రతి నెల 40 నుంచి 45 బ్యాగుల బియ్యం పక్కదారి పడుతున్నట్లు కార్డుదారులు ఆరోపిస్తున్నారు. ఇలా రూ.లక్ష వరకు ఆదాయం గడిస్తున్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఈ వ్యాపారంలో పౌరసరఫరాల శాఖ అధికారులకు కూడా



మామూళ్లు అందుతున్నట్లు ఆరోపిస్తున్నారు. అందుకే ఈ అక్రమ వ్యాపారం క్లైదుటే జరుగుతున్నా మీనమేషాలు లెక్కిస్తున్నారనే వాదన గట్టిగా వినిపిస్తోంది. స్థానికులు సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెలుగులోకి తేవడంతో అక్రమ వ్యాపారం బట్టబయలైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ రేషన్ దందాకు కళ్లెం వేయాలని కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు.

35 కేజీలకు 20 కేజీలే ఇచ్చారు..

నాది అంత్యోదయ కార్డు. 35 కేజీల బియ్యం రావాలి. కానీ నాకు 20 కేజీల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇదేమని అడిగితే.. వచ్చింది అంతే అని చెప్పారు. తర్వాత 15 కేజీలకు డబ్బులు ఇచ్చారు. మాకు డబ్బులు ఎందుకండీ ? బియ్యంకావాలి. – కళావతి, వినాయకపురం



పేదలకు అన్యాయం చేస్తే ఎలా ?

ఏవండీ..ఈ రేషన్ బియ్యాన్నే నమ్ముకుని ఈడా చాలా కుటుంబాలు బతుకుతా ఉండాయి. వాళ్ల కడుపు కొడితే ఏమైనా న్యాయమా ? ఒకరికి 20 కేజీలకు 10 కేజీలిస్తారండీ. ఇంకో ఆమెకు 35 కేజీలు ఇవ్వాలి. ఎంతో ఇచ్చారో ఆమెనే అడుగుదాం ..రండీ. ఇది చానా అన్యాయమండీ. అధికారులు రావాలి. మాకు న్యాయం జరగాలా ? ఆ డబ్బులు మాకు వద్దండి. – కలైవాణి, వినాయకపురం



మరోచోట రేషన్ పట్టుకున్నాం..

మరోచోట భారీ మొత్తంలో రేషన్ పట్టుబడింది. ఇద్దరు డీటీలు అక్కడే ఉన్నారు. పంచనామా చేస్తున్నారు. ఆలస్యం అవుతోంది. వీలైతే రాత్రికి తనిఖీ చేస్తాం. లేకుంటే గురువారం ఉదయం విచారిస్తాం. తేడాలను గుర్తిస్తాం. షాపునకు వెళ్లి ఆర్‌ఓ చూస్తేనే తెలుస్తుంది. సరుకు ఎంత ఉంది..ఏమి అనేది కచ్చితంగా షాపుపై చర్యలు తీసుకుంటాం. – శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

వ్యాపారులపై కూటమి కుట్ర

చిత్తూరు నగరం నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ (పాత బస్టాండు) బస్టాండు. చరిత్రకు గుర్తు. ఒకప్పుడు వేలాది మంది చిరు వ్యాపారులకు అన్నం పెట్టిన కల్ప వృక్షం. ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు అమ్మఒడి లాంటిది. చేతిలో పది రూపాయలు ఉంటే.. మొక్కజొన్నలు వ్యాపారం చేసుకుని ఇంటిల్లిపాదికి అన్నం పెట్టిన అన్నపూర్ణ. కులవృత్తినే నమ్ముకున్న చర్మకారులు.. చెప్పులు కుడుతూ రెండు, మూడు తరాలకు పెళ్లిళ్లు, చదువులు చెప్పించిన పుణ్యభూమి. అలాంటి పాత బస్టాండు కళ తప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యాపారులను బలవంతంగా బయటకు తరిమేసేందుకు సిద్ధమైంది.

- చిత్తూరు పాత బస్టాండులో అధికార పార్టీ బలవంతపు గెంటివేతలు
- ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చేందుకు కూటమి నేతల లోపాయికారీ ఒప్పందం
- స్థలం వదలుమంటున్న వ్యాపారులు
- వ్యాపారులకు మద్దతుగా నేడు వైఎస్సార్‌సీపీ ధర్నా

చిత్తూరు అర్బన్: చిత్తూరు పాత బస్టాండుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1956వ సంవత్సరంలో చిన్న బస్టాండుగా అప్పటికే బస్సుల రాకపోకలు ఇక్కడ జరిగేవి. గుడిసెలు వేసుకుని ముందువైపు చిన్నపాటి వ్యాపారాలు చేస్తూ.. వెనుక కాపురం ఉండేవాళ్లు. 1968వ సంవత్సరంలో చిత్తూరు షాప్ కీపర్లు అసోసియేషన్‌గా ఏర్పడి.. అందరూ కలిసి వ్యాపారాలు చేసేవారు. ఆ తరువాత 1977లో కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ బస్టాండుగా మారుస్తూ నాటి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే 1980లో ఇక్కడున్న దుకాణాల నుంచి అద్దె వసూలుకు అప్పటి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వగా, వ్యాపారులు.. 1983లో కోర్టును ఆశ్రయిస్తే మున్సిపాలిటీకి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని తీర్పు ఇచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. 1996లో నాటి రెవెన్యూశాఖ మంత్రి దేవేంద్రగౌడ్ సూచనతో రూ.8.66 లక్షలు మార్కెట్ విలువగా చెల్లించి, వ్యాపారులు బస్టాండులోని స్థలాలకు పట్టాలు పొందారు. 2018లో రోడ్డు విస్తరణ సందర్భంగా అప్పటి టీడీపీ ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశాలతో మున్సిపల్ యంత్రాంగం బస్టాండును మూయించింది. ఇక్కడ అధునాతన షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తామని చెప్పి, ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం రూపాయి విదల్చలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక బస్టాండులో షాపింగ్ కాంప్లెక్సు కథ మళ్లీ తెరపైకి వచ్చింది. ఈసారి వ్యాపారులను సైతం బలవంతంగా బయటకు వెళ్లాలని హుకూం జారీ చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కింద రూ.కోట్లు విలువచేసే బస్టాండు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే కుట్రకు తెరలేపిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బస్సులతో కళకళ్లాడుతున్న చిత్తూరు పాత బస్టాండు (ఫైల్)



ప్రవేశం లేకుండా ప్రహరీతో కళ తప్పిన ప్రస్తుత చిత్తూరు బస్టాండు

వ్యాపారులకు అండగా వైఎస్సార్‌సీపీ..

అధికారులు, పాలకులు చేస్తున్న తప్పిదాలను ఎండగడుతూ వ్యాపారులకు అండగా నిలబడ్డానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చింది. ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బస్టాండులో ధర్నా నిర్వహించనున్నారు. వ్యాపారుల పక్షాన నిలబడేందుకు సిద్ధమయ్యారు.

పోలీసుల కవ్వింపు చర్యలు..

చిత్తూరు పాత బస్టాండులో నిరసన తెలియజేయడానికి గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, గాయత్రీదేవి మరికొందరు నేతలు స్థానిక డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు లేఖ ఇచ్చారు. కానీ చిత్తూరులో వైఎస్సార్‌సీపీ ధర్నాకు అనుమతి లేదని, ఎవరైనా ధర్నా చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు సామాజిక మాధ్యమాల్లో హెచ్చరికలు జారీ చేశారు.

60 మంది ప్రత్యేక ప్రతిభ పిల్లల గుర్తింపు



చిత్తూరులో పిల్లలను గుర్తిస్తున్న జడ్జి, సభ్యులు



తవణంపల్లెలో వివరాలు సేకరిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి

చిత్తూరు అర్బన్: ప్రత్యేక ప్రతిభ ఉన్న పిల్లల రక్షణలో భాగంగా జిల్లాలో 60 మంది పిల్లలను గుర్తించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. ఈనెల పదో తేదీ నుంచి జిల్లాలో ఆరు వేలకు పైగా ఇళ్లను సందర్శించిన బృందం.. ప్రత్యేక ప్రతిభ ఉన్న పిల్లలకు చట్టంలో ఉన్న వెసులుబాటు గురించి వివరించారు. ఇందులో భాగంగా 60 మంది పిల్లలను సైతం గుర్తించారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపంతో బాధపడుతున్న వీళ్లకు సరైన చికిత్స అందించడానికి న్యాయసేవాధికార సంస్థ చర్యలు తీసుకుందని న్యాయమూర్తి తెలిపారు. ఇంకా ఎక్కడైనా ఇలాంటి పిల్లలు ఉంటే చిత్తూరు కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) భవనంలో సంప్రదించాలని కోరారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలను గుర్తించి అవసరమైన సేవలందిచడమే ప్రధాన లక్ష్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు పర్యవేక్షణలో గురువారం ఆమె తవణంపల్లెలోని బాలిక లలిత్యసాయి(6) వివరాలు సేకరించారు. బాలికకు పెన్షన్ రావడం లేదని తండ్రి కుమార్ తెలుపగా..ఆమె వెంటనే ఎంపీడీఓ రెడ్డిబాబుతో ఫోన్ మాట్లాడి ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలకు పెన్షన్ ఎందుకు రావడం లేదని, వెంటనే వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే దామోదరం కుమారుడు పవన్‌సాయి(ఐదున్నరేళ్లు) వివరాలను సేకరించారు. పింఛన్ కోసం ఏడా దిగా తిరుగుతున్నా మంజూరు కాలేదని దామోదర్ తెలిపారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, ఎస్ఐ చిరంజీవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదం ఎలా ఉంది ?

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఉచిత అన్నదాన భవనాన్ని గురువారం ఈఓ పెంచల కిషోర్ పరిశీలించారు. వంటగదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కూరగాయల నాణ్యతను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. ఉచిత అన్నదాన ప్రసాదం ఎలా ఉందని భక్తుల అడిగారు. వారు సంతృప్తి వ్యక్తం చేశారు.



భక్తులతో మాట్లాడుతున్న ఈఓ పెంచల కిషోర్

మసెమ్మ జాతరలో పెద్దిరెడ్డి

పుంగనూరు: మసెమ్మ జాతరతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జాతర్లు ప్రారంభం కావడం ఆనవాయితీగా వస్తోందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కురప్పల్లెలో జరిగిన మసెమ్మ జాతరకు పెద్దిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి వారితో సరదాగా గడిపారు. అక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ మసెమ్మతల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు చల్లగా ఉండేలా దీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. మసెమ్మ జాతరకు వేలాది మంది హాజరుకావడం, తాము ఏటా అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టమని పెద్దిరెడ్డి తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ నంజుండప్ప, సర్పంచ్ శంకరప్ప, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి

ఉన్నతాశయంతో ముందుకు సాగాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతాశయంతో ముందుకు సాగాలని సమగ్రశిక్ష శాఖ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో పాఠశాల 14 వ వార్షికోత్సవం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఏపీసీ, ఎంఈఓ–2 మోహన్ మాట్లాడుతూ విద్యార్థులంతా చదువుతో పాటు క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజ, హెచ్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ

క్లుప్తంగా

జేఈఈ టాపర్‌కు అభినందనలు



సాయిబ్రింద‌కు నగదు ఇస్తున్న యాజమాన్యం

గంగవరం: జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా జూనియర్ కళాశాల విద్యార్థిని సాయిబ్రింద జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం కళాశాల యాజమాన్యం విద్యార్థినిని అభినందించారు. కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాయిబ్రింద జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.01 శాతం పర్సంటైల్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారన్నారు. విద్యార్థికి రూ. 10వేల నగదును బహుమతిగా అందజేశారు. అకడమిక్ అడ్వైజర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సదుం: పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్ షావలి గురువారం తెలిపారు. మండలంలోని గొడ్లవారిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాలల్లో మామిడి చెట్టు కింద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అక్కడ పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకుని రూ.10,620 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అడవి పందుల దాడిలో దుప్పి మృతి



చిత్తూరు కార్పొరేషన్: నగరంలో అడవి పందుల దాడిలో దుప్పి మృతి చెందినట్లు గురువారం తూర్పు ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. స్థానిక రెడ్డిగుంట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి దుప్పి దాహార్తి కోసం బయటకు వచ్చినట్లు తెలుస్తోందన్నారు. పీవీకేఎన్ డిగ్రీ కళాశాల సమీపంలో అడవి పందులు దాడి చేయడంతో మృతి చెందిందన్నారు. వీటిపై సమాచారం వచ్చిన వెంటనే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. అనంతరం స్థానిక పశు వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారన్నారు. చివరిగా అటవీప్రాంతంలో దహనం చేసినట్లు వివరించారు.

పంటలపై ఏనుగుల దాడులు


పెద్దపంజాణి: మండలంలో సాగు చేసిన పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామానికి చెందిన గంగులప్ప, జ్యోతమ్మ తదితర రైతుల వరి పొలాలను ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా తగి న చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాడి పశువుల చోరీ

బంగారుపాళెం: మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 8 పాడిపశువులను దొంగలించుకు పోయారని రైతులు వాపోయారు. మండలంలోని మొగిలి, మొగిలిమిట్టూరు, లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు వెంకటేష్, కాంత్రికుమార్, ఏకాశిరెడ్డికి చెందిన 6 పాడిఆవులు, టేకుమందలో మరో రైతుకు చెందిన 2 ఆవులు చోరీకి గురయ్యాయన్నారు. పాడి పశువుల చోరీపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ప్రేమాయనమః





- ఎళ్లలు దాటిన ప్రేమ
- నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న కొందరు..
- ప్రేమికుల రోజు సందర్భంగా పలువురి ప్రేమకథలు

ప్రేమ.. రెండు అక్షరాలు.. దీనికి కులాలు, మతాలు, ఆస్తులు, అంతస్తులతో పని లేదు. నేటి తరంలో కొందరు యువత కాస్త ప్రేమ అనే ముసుగులో చెడుదారి పడితే.. మరికొందరు మాత్రం ప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. అన్నీ వదిలేసి ప్రేమ కోసం నిలబడిన వారెందరో. పెద్దలను ఎదిరించి కొందరు.. ఒప్పించి కొందరు పెళ్లి చేసుకున్నా వారు ఉన్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమ పెళ్లి చేసుకుని అన్యోన్యంగా జీవిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న పలువురి ప్రేమకథలు తెలుసుకుందాం.

– పలమనేరు



వీరు.. లవ్ డాక్టర్స్..



డాక్టర్లు రజనీ-రాజశేఖర్ దంపతులు

పలమనేరు పట్టణానికి చెందిన డా.రజని, డా.రాజశేఖర్ ఫిజియోథెరపిస్టులుగా అందరికీ సుపరిచితులే. వీరిది ప్రేమవివాహం. వీరిలో రాజశేఖర్‌ది అనంతపురం జిల్లా గుంతకల్లు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి ఫిజియోథెరపీ అభ్యసించేందుకు నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో చేరాడు. అక్కడే పలమనేరుకు చెందిన రజనీతో పరిచయం ఏర్పడింది. వీరిమధ్య ఏర్పడిన స్నేహం.. ఆపై ప్రేమగా మారింది. మూడేళ్ల ప్రేమించుకున్న తరువాత పెద్దలను ఒప్పించి 2013లో పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ వివాహ ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్నారు. వీరికి ఓ కుమారుడున్నారు.

కోమలమైన ప్రేమ కోసం..



కోమల-రామకృష్ణ దంపతులు

వారి ప్రేమ చిగురించే నాటికి అన్నీ కష్టాలే. అయినా మొక్కవోని ధైర్యంతో వారు పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఆపై కష్టాలను జయించారు పలమనేరు పట్టణం గంటావూరులో కాపురం ఉంటున్న రామకృష్ణ, కోమల దంపతులు. నల్లప్పరెడ్డి కోమల నాలుగో తరగతి చదువుతున్నప్పుడే తండ్రి ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తల్లి భవన నిర్మాణ కూలీ. కోమల ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్‌లోనే కాలేజీకి వెళ్లలేక పట్టణంలోని ఓ బుద్ధిమాంద్యం స్కూల్లో పిల్లలకు సేవచేసే పనిలో చేరింది. అదే స్కూల్‌కు చెందిన బస్సు డ్రైవర్‌గా ఉన్న రామకృష్ణతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆ తరువాత ఇంట్లోవాళ్లను ఒప్పించి కాణిపాకంలో 2007 ఫిబ్రవరి 24న పెళ్లి చేసుకున్నారు. అనంతరం భర్త ప్రోత్సాహంతో ఆమె దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేసింది. ఇప్పుడు స్థానిక ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఇదే ఆస్పత్రిలో ఆమె భర్త రామకృష్ణ అంబులెన్స్ డ్రైవర్‌గా. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అలా మొదలైన ప్రేమ..



డా. సునీల్, డా.మమతారాణి దంపతులు

సమాజానికి సేవ చేస్తూ ఇద్దరు పిల్లలతో ఆదర్శంగా నిలుస్తున్నారు పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్, పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెంటెంట్ డా.మమతారాణి దంపతులు. వీరి ప్రేమకథ ఎలా మొదలైందంటే..పాకాలకు చెందిన ఉపాధ్యాయులు రఘునాథయ్య కుమారుడు ముత్తిరేవుల సునీల్‌కుమార్, రాజమండ్రికి చెందిన బ్యాంకు మేనేజర్ శ్రీహరి నారాయణ, నిర్మలాదేవి కుమార్తె కాండ్రకోట మమతారాణి 1991లో సిద్ధార్థ మెడకల్ కళాశాలలో క్లాస్‌మేట్స్. ఇద్దరి మనుసులు కలిశాయి. సునీల్ ముందుగా తన ప్రేమను వ్యక్తం చేశారు. అయితే మమతారాణి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పగా అంగీకరించలేదు. కులాంతర వివాహానికి అడ్డు చెప్పారు. 1998 డిసెంబరు 28 పాకాలలో వీరి వివాహం జరిగింది. ఈ పెళ్లికి మమతారాణి తల్లిదండ్రులు రాలేదు. ఆ తర్వాత వీరికీ సినిమా కష్టాలు తప్పలేదు. కానీ వీరిద్దరూ ప్రేమకు కొత్త భాష్యం తెలుపుతూ అన్యోన్య దంపతులుగా నిలిచారు. వీరికి ఇద్దరు పిల్లలు. వైఎస్సార్ స్ఫూర్తితో భర్తతో సమాజానికి సేవ చేయించాలనే లక్ష్యంతో ఆమె భర్తను రాజకీయాల్లోకి వెళ్లేలా ప్రోత్సహించారు. ఆపై డా.సునీల్ పూతలపట్టు ఎమ్మెల్యేగా గతంలో పనిచేశారు. ఇప్పుడు కూడా ఆ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

వీరిది ప్రేమ 'పరీక్ష'



బాబాజాన్, మీరా దంపతులు

పట్టణానికి చెందిన ముస్లిం కుటుంబానికి చెందిన బాబాజాన్, క్రైస్తవ కుటుంబానికి చెందిన మీరా 2001లో ఇంటర్ పరీక్షలు రాసేందుకు వెళ్లి ఎగ్జామ్ సెంటర్‌లో వీరు పరిచయం అయ్యారు. ఆపై మనుసులు కలిశాయి. ఆరేళ్ల పాటు సాగిన వీరి ప్రేమకు కూడా పెద్దల నుంచి అభ్యంతరాలు తప్పలేదు. దీంతో వీరు అప్పటి సీఐ నంజుండప్పను కలిసి విన్నవించగా పెళ్లి చేశారు. ఇప్పుడు మీరా ఫిజియోథెరపిస్ట్‌గా, బాబాజాన్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు.

ఉత్తరాలతో మొదలై..



బాలాజీ, వారిజ దంపతులు

1991లో ఓ పత్రికలో పలమనేరుకు చెందిన బాలాజీ రాసిన కథ పుంగనూరుకు చెందిన గండికోట వారిజకు నచ్చి ఆయనపై ప్రేమ పుట్టేలా చేసింది. ఒకరినొకరు చూసుకోకుండానే ప్రేమ లేఖలు రాసుకున్నారు.. ఆపై కులాలు వేరైనా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం బాలాజీ పెద్దపంజాణి ఎంపీడీఓగా, రాష్ట్రస్థాయిలో ప్రముఖ కవిగా ఉన్నారు. వారిజ పోస్టల్ శాఖలో ఉద్యోగి. ప్రకృతిని సృజనాత్మక చిత్రాల ద్వారా తీసే ఫొటోగ్రాఫర్‌గా, రచయిత్రి కూడా. వీరి ఇద్దరు కుమార్తెలు ఆయుర్వేదిక్, హోమియోపతి డాక్టర్లు.

స్నేహితులే పెళ్లి పెద్దలై..



కుమార్, శారదా దంపతులు

పట్టణానికి చెందిన కుమార్ 1996లో తన డిగ్రీ క్లాస్‌మేట్ అయిన శేషాపురానికి చెందిన శారదను ప్రేమించాడు. వీరి ప్రేమాయణం మూడేళ్లు సాగింది. వీరిపెళ్లికి పెద్దలు నిరాకరించడంతో స్నేహితుల సాయంలో ప్రేమికుల రోజును వీరు కాణిపాకం ఆలయంలో 1999లో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు కుమార్ కాఫీ షాపు నిర్వహిస్తుండగా శారద ప్రైవేటు స్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తోంది. ఇప్పటికీ వీరి ఇరుకుటుంబాల పెద్దలు వీరి ప్రేమను అంగీకరించలేదు. వీరికో కుమారుడు. నాడు ప్రేమికుల రోజున వీరి పెళ్లి జరిగి నేటికి 25 ఏళ్లు అయింది.

ఆన్‌లైన్‌లో రైల్వే పాస్




- పాసులు తీసుకోవడానికి దివ్యాంగులకు తప్పని ఇక్కట్లు
- ఇకపై ఆన్‌లైన్‌లో తీసుకునేలా రైల్వేశాఖ చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

చిత్తూరు కార్పొరేషన్: పాసులు తీసుకోవడానికి దివ్యాంగులు పడే కష్టాలకు రైల్వే శాఖ చెక్ పెట్టింది. దివ్యాంగులు ఇక నుంచి రైల్వే పాసులను నేరుగా స్టేషన్‌కు వచ్చి తీసుకునే పని లేకుండా ఆన్‌లైన్‌లో అందించేందుకు రైల్వేశాఖ వెబ్‌సైట్ ప్రారంభించింది. అందులోనే ఈ-టికెట్లు బుక్ చేసుకునే ఆ శాఖ అధికారులు కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. చిత్తూరు జిల్లా పరిధిలో మొత్తం 34,150 మంది వరకు దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 19,200 మంది వరకు శారీరక వికలాంగులు, అంధులు 3,050 మంది, చెవిటి, మూగ వారు 10,320 మంది, 1,580 మంది బుద్ధిమాంద్యం కలిగిన వారు ఉన్నారు. ఇందులో దాదాపు 17 వేల మంది వరకు పాసులు పొందుతున్నట్లు సమాచారం. రైల్వే పాసుల కోసం దివ్యాంగులు నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా రైల్వే శాఖ ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో దివ్యాంగులకు ఆ కష్టాలు తప్పనున్నాయి.

నూతన విధానంతో సులభతరం

రైల్వేశాఖ దివ్యాంగుల పాసులు పొందేందుకు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో జిల్లావాసులు సంబంధిత రైల్వేస్టేషన్‌కు ఇతరుల సాయంతో చేరుకునేవారు. అక్కడ దరఖాస్తును అందజేసేవారు. రైల్వే అధికారులు జిల్లా నుంచి వచ్చిన మొత్తాన్ని సేకరించి గుంతకల్లు డివిజన్‌కు పంపేవారు. అక్కడ అధికారుల ఆమోద ముద్ర పడిన తరువాత తిరిగి జిల్లాకు వచ్చేది. ఇదంతా జరగడానికి దాదాపు మూడు నెలల వరకు సమయం పట్టేది. ఈ లోపు పాసుల కోసం దివ్యాంగులు నాలుగుసార్లు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. వారి ఇబ్బందులను గుర్తించి నూతన విధానానికి నాంది పలికారు. దివ్యాంగులు తాము ఉండే ప్రాంతం నుంచే నెట్ సెంటర్, ఈ-సేవా కేంద్రం ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తరువాత 20 రోజుల్లోపు వారు ఆన్‌లైన్‌లో పాసు తీసుకోవచ్చు. సమయంతో పాటు శారీరక, ఆర్థిక శ్రమ ఉండదు.



దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్

ఆన్‌లైన్‌లో పాసుల జారీ

ఇకపై దివ్యాంగులు సమీప ఇంటర్‌నెట్ సెంటర్ లేదా తమ ఇంట్లోని కంప్యూటర్ నుంచి ఆన్‌లైన్‌లో http://divyangjanid.indianrail.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పాసు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులోనే యూనిక్ డిజిబిలిటీ ఐడీ కార్డు (యూడీ ఐడీ) మంజూరు చేస్తారు. నూతన పాసులు కావాల్సినవారు, పాత పాసులు రెన్యూవల్‌కు కూడా ఇందులోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే వెబ్‌సైట్ అమల్లోకి వచ్చింది. దివ్యాంగులు ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్‌లోనే పాసు ఐడీకార్డును తీసుకోవచ్చు. కొత్తగా దరఖాస్తు చేసుకునే సమయంలో తొలుత తన పేరు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ ఎంటర్ చేసి తర్వాత వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి తర్వాత వచ్చిన లాగిన్ అవ్వాలి. ఇలా ఎన్నిసార్లు అయినా లాగిన్ అయి దరఖాస్తును పరిశీలించుకోవచ్చు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించి ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికే వారానికోసారి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తోందన్నారు. నియోజకవర్గంలో అధికంగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బారులు తీరిన జనం..

కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 అర్జీలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. వీటిలో 74 కేవలం రెవెన్యూ సమస్యలపైనే అందాయన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే..!

– ప్రియుడితో కలిసి భర్తను చంపిన మహిళ అరెస్టు



రెడ్డెప్ప (ఫైల్)

ఐరాల: ప్రియుడి మోజులో పడి ఓ మహిళ భర్తనే కడతేర్చిన కేసును పోలీసులు ఛేదించారు. వివరాలు.. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ నరసింహులు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. మండలంలోని నయనంపల్లెకు చెందిన బీ.రెడ్డెప్ప(41) కనిపించడం లేదని భార్య కామేశ్వరి 2023 జనవరి 7వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో కామేశ్వరి కంచంవారిఇండ్లుకు చెందిన కే.సుధాకర్‌తో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు తేలింది. ఇద్దరినీ తమదైన శైలిలో విచారించగా.. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడనే ఇద్దరూ కలిసి రెడ్డెప్పను 2022వ సంవత్సరం నవంబర్ 17వ తేదీ రాత్రి ఇంటి వద్దే బండరాయితో కొట్టి హతమార్చినట్లు ఒప్పుకున్నారు. ఆపై మృతదేహాన్ని నల్లని టార్పాలిన్ పట్టలో చుట్టి, కొన్ని రాళ్లు కూడా అందులో వేసి గ్రామ సమీపంలోని ఓ పాడుబడిన బావిలో పడేశామన్నారు. పోలీసులు గురువారం ఘటనా స్థలికి చేరుకుని బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.



మృతుడి అస్తిపంజరాలకు శవపంచనామా చేస్తున్న వైద్యులు

అస్తిపంజరానికి తహసీల్దార్ మహేష్‌కుమార్, పోలీసులు, రెవెన్యూ, వైద్యులు, మృతుడి బంధువుల సమక్షంలో శవపంచనామా చేశారు. అనంతరం అస్తిపంజరాన్ని పట్టలో కట్టి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య కామేశ్వరి, ప్రియుడు సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించారు.

పారిశుద్ధ్యానికే మొదటి ప్రాధాన్యత



కార్వేటినగరం: కార్యదర్శులతో కలసి చెత్తను సేకరిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

కార్వేటినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు పెద్దపీట వేయాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీలో 9 మండలాల ఈఓపీఆర్డీలు, కార్యదర్శులకు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్‌లో భాగంగా ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పంచాయతీలో పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి కార్యదర్శి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య లోపాన్ని గుర్తించి మెరుగు పరిచేందుకు అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. ప్రతి ఎస్‌డబ్ల్యూపీసీ నుంచి చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం, మాంబేడు పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై ఆయా కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్వేటినగరం మండలంలో అనేక పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండడంతో ఈఓపీఆర్డీ నాగరత్నమ్మను అభినందించారు. బంగారుపాళ్యం మండలం బొమ్మసముద్రం పంచాయతీ పారిశుద్ధ్యం మెరుగులో ఉత్తమ పంచాయతీగా నిలిచి దేశస్థాయిలో రాష్ట్రపతి చేతుల మీదుగా కార్యదర్శి మౌనిక అవార్డును అందుకుని, రూ.కోటి నిధులు మంజూరు చేశారని తెలిపారు. అలాంటి వారిని ప్రతి కార్యదర్శి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎల్‌పీఓ పార్వతి మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపడితే ప్రజలంతా ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అలాగే మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో వీధుల్లో చెత్త సేకరించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ షణ్ముగం, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓపీఆర్డీలు నాగరత్నమ్మ, లక్ష్మీపతి, మండల కోఆర్డినేటర్ ఏకాంబరం, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో ఆ పనులు చేయాల్సిందే

- పలమనేరు ఎంపీడీఓకు హైకోర్టు అక్షింతలు
- మండల, జెడ్పీనిధులు ఖర్చు చేయకుండా కూటమి నేతల అడ్డగింత
- అధికార పార్టీ నేతల చేతుల్లో కీలుబొమ్మగా ఎంపీడీఓ
- హైకోర్టును ఆశ్రయించిన స్థానిక ప్రజాప్రతినిధులు
- నెలరోజుల్లో పనులు చేపట్టాలన్న హైకోర్టు ధర్మాసనం

పలమనేరు: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని మహాత్మాగాంధీ చెప్పిన మాట. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, రిపేర్లు తదితరాలకు జెడ్పీ, మండల గ్రాంట్లకు సంబంధించిన నిధులు ఉన్నాయి. కానీ కూటమి నేతలు వీటిని ఖర్చు పెట్టనీయకుండా ఎంపీడీఓను కట్టడి చేయడంతో మంజూరైన నిధులను సైతం వాడుకోలేని పరిస్థితి పలమనేరు మండలంలో నెలకొంది. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేక కొందరు సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు.

అసలు ఏమి జరిగిందంటే..!

పలమనేరు మండలానికి సంబంధించి గతంలో జరిగిన మండలమీట్‌లో ఎంపీపీ నాలుగు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఇందులో జగమర్లలో మంచినీటి సరఫరా, కురప్పల్లిలో సీసీ రోడ్డు, బయ్యప్పగారిపల్లిలో పైపులైను ఏర్పాటు, ఇందుకోసం ఈ రెండు నిధుల ద్వారా రూ.55 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే కూటమి నేతల ఒత్తిళ్లతో పలమనేరు ఎంపీడీఓ ఖాదర్‌బాషా ఈ పనులకు ఆమోదం తెలుపలేదు. దీంతో ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.


IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI


A. Viswanatha Reddy ...Petitioner

Vs

The State of Andhra Pradesh and others ...Respondents

CORAM: THE CHIEF JUSTICE DHIRAJ SINGH THAKUR
SRI JUSTICE RAVI CHEEMALAPATI


DATE: 5th February 2025


DHIRAJ SINGH THAKUR, CJ

RAVI CHEEMALAPATI, J

పలమనేరు ఎంపీడీఓకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలిచ్చిన తీర్పు కాపీ

హైకోర్టును ఆశ్రయించిన వైనం



మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి

మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు, మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి దీనిపై పీఆర్ అండ్ ఆర్‌డీ ఉన్నతాధికారులతో పాటు ఎంపీడీఓలపై హైకోర్టులో రిట్ పిటిషన్(18/2025)ను దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రవి చీమలపాటి ఈనెల 5న తీర్పును వెలువరించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ పెండింగ్‌లోని నిధులను నెలరోజుల్లో ఖర్చు చేయాలని తీర్పులో ఆదేశించారు. ఎట్టకేలకు హైకోర్టులో న్యాయం గెలిచించని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.